క్లుప్తంగా

నేడు కోటి సంతకాల సేకరణ

చిట్టమూరు: రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన మెడికల్ కళాశాలను ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో శనివారం కోటి సంతకాల సేకరణ, రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ సన్నారెడ్డి శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. దీనికి ముఖ్యులుగా ఉమ్మడి నెల్లూరు జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ, గూడూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త మేరిగ మురళీధర్ హాజరవుతారన్నారు. చిట్టమూరులో సాయంత్రం 4 గంటలకు, ఆలేటిపాడు గ్రామంలో సాయంత్రం 5 గంటలకు, పిట్టివానిపల్లి గ్రామంలో 6 గంటలకు కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమానికి మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల అధ్యక్షులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

20న కోనలో దీపావళి వేడుకలు


పెంచలకోన క్షేత్రం

రాపూరు: మండలంలోని ప్రముఖ పుణ్య క్షేత్రం పెంచలకోనలో 20వ తేదీ దీపావళి వేడుకలు నిర్వహించనున్నట్లు దేవస్థాన అధికారులు తెలిపారు. దీపావళి పర్వదినం సందర్భంగా పెంచలకోనలో పురవీధుల్లో రథోత్సవం, ఆర్టీసీ బస్టాండు వద్ద నరకాసుర వధ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటలకు శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవిని, చెంచులక్ష్మి దేవతల ఉత్సవ విగ్రహాలను రథంపై కొలువుదీర్చి కోన మాడవీధుల్లో క్షేత్రోత్సవం, నరకాసుర వధ నిర్వహించనున్నట్లు అధికారులు వివరించారు.

22 నుంచి కార్తీక మాసోత్సవాలు

చిట్టమూరు: మండల పరిధిలోని మల్లాం గ్రామంలో వెలసిన పురాతన, బ్రహ్మసూత్ర లింగం కలిగిన శ్రీ కామాక్షీ దేవి సమేత మార్కండేశ్వర స్వామి ఆలయంలో అక్టోబర్ 22 నుంచి నెల రోజుల పాటు కార్తీక మాసోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్టీ దువ్వూరు శేషురెడ్డి శుక్రవారం తెలిపారు. ఆలయంలో కార్తీక మాసంలో విశేష పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. అక్టోబర్ 27న కార్తీక సోమవారం (కోటి సోమవారం) మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సెప్టెంబర్ 3న కార్తీక పౌర్ణమి సందర్భంగా జ్వాలా తోరణం, చెరువులో(శివజ్యోతి) దీపాలు వదిలే కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో క్యాంపస్ సెలక్షన్స్

కోట: మండల కేంద్రంలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో శుక్రవారం బెంగళూరుకు చెందిన ఎంకొరేటా కంపెనీ క్యాంపస్ సెలక్షన్స్ నిర్వహించింది. బీటెక్ ఫైనలియర్ ఎలక్ట్రికల్ విభాగం విద్యార్థులు 120 మంది ఇంటర్వ్యూలకు హాజరుకాగా 8 మంది ఉద్యోగాలు సాధించినట్లు ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కిషంధర్ తెలిపారు. వారిని కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

యూరియా ఇవ్వండి మహాప్రభో

రాపూరు: మండలంలోని నిమ్మరైతులకు యూరియా అందించాలని మండలంలోని రైతులు వ్యవసాయ అధికారులను కోరుతున్నారు. మండలానికి యూరియా కేటాయించకపోవడంతో నిమ్మ రైతులు ఆందోళన చెందుతున్నారు. నిమ్మ చెట్లకు ఎరువులు వేసే సమయం ఆసన్నమైందని యూరియా అందుబాటులో లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నామని చెప్పారు. అదను దాటిన తరువాత ఎరువులు వేసినా ఉపయోగం లేదని రైతులు తెలిపారు.

పాము కాటుకు వ్యక్తి మృతి


మృతి చెందిన పెంచలయ్య

కలువాయి(సైదాపురం): పాము కాటుకు వ్యక్తి మృతి చెందిన సంఘటన కలువాయి మండలంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన దండు పెంచలయ్య (48) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం రాత్రి కాల కృత్యాల కోసం బయటకి వెళ్లి తిరిగి ఇంటికి వచ్చి స్పృహ తప్పి పడిపోయాడు. ఆయన నోటిలో నుంచి నురగ రావడం కుటుంబ సభ్యులు గమనించి స్థానిక ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు ఎస్‌ఐ కోటయ్య కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చికెన్ ధరలు 18-10-2025

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ లైవ్	:	127
లేయర్ లైవ్	:	118
బ్రాయిలర్ చికెన్	:	230
బ్రాయిలర్ స్కిన్ లెస్	:	254
లేయర్ చికెన్	:	200


సమావేశానికి హాజరైన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నేతలు, అభిమానులు


సమావేశంలో మాట్లాడుతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి, సభికులకు అభివాదం చేస్తున్న నేదురుమల్లి

వైద్యవిద్యకు కూటమి సంకెళ్లు

- మెడికల్ కళాశాల ప్రైవేటీకరణపై నిరసన
- వ్యతిరేకంగా వెంకటగిరిలో కోటి సంతకాల సేకరణ
- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వెంకటగిరి (సైదాపురం): సామాన్యులకు వైద్య విద్యను అందకూడదనే దురుద్దేశంతో కూటమి ప్రభుత్వం తమ అనుచరులకు ప్రభుత్వ ఆస్తులను దోచిపెట్టే దుర్మార్గపు ఆలోచనలో సీఎం చంద్రబాబు పాలన సాగిస్తున్నారని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని నేదురుమల్లి నివాసంలో రామ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాకాణి గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్లలో చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రానికి 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలను తీసుకొచ్చారన్నారు. వాటిని కొనసాగిస్తే జగనన్నకు ఎక్కడ మంచి పేరు వస్తుందోనన్న దుర్బుద్ధితో పాటు తన బినామీల కోసం కూటమి ప్రభుత్వం ప్రైవేటు పార్టనర్ షిప్ (పీపీపీ) పేరుతో ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేస్తూ పేదల నోట్లో మట్టి కొట్టిన చంద్రబాబు చరిత్ర హీనుడిగా మిగిలిపోతారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన ప్రైవేటు మెడికల్ కళాశాలల్లో 5 మెడికల్ కళాశాలలు అందుబాటులోకి వచ్చి తరగతులు, వైద్యసేవలు అందిస్తుండగా మరో 12 కళాశాలలు నిర్మాణంలో ఉన్నాయన్నారు. సీఎం చంద్రబాబు వాటిని ప్రైవేటీకరణ చేస్తే లక్షలాదిమంది విద్యార్థులకు అన్యాయం చేసినట్టేనని తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమం మరిచి డైవర్షన్ పాలిటిక్స్ చేయడం దారుమణన్నారు. నకిలీ మద్యంపై వార్తలు రాసే మీడియాపై కూడా కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం దుర్మార్గమని చెప్పారు.

వచ్చే ఎన్నికల్లో వెంకటగిరి నియోజకవర్గం సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించి జగనన్నకు గిఫ్ట్‌గా ఇద్దామని పిలుపునిచ్చారు.

అసమర్థ ప్రభుత్వాన్ని నిలదీద్దాం

కూటమి ప్రభుత్వాన్ని కోటి సంతకాల కార్యక్రమం ద్వారా నిలదీద్దామని వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులకు వైద్య విద్యను చేరువ చేయడమే లక్ష్యంగా మాజీ సీఎం వైఎస్ జగన్ వైద్య కళాశాలలు నిర్మాణం చేపడితే వాటిని కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరించడం సిగ్గుచేటన్నారు. వైద్య విద్య అభ్యసించాలనుకునే విద్యార్థుల కోసం చేపట్టిన కోటి సంతకాల కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. జగన్ 2.0 ద్వారా కార్యకర్త సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇవ్వడంతోపాటు వారికి అండగా నిలబడతామన్నారు. అధికారులు కూడా కూటమి నేతల కన్నుసన్నల్లో ఇష్టానుసారంగా వ్యవహరించడం ఇకనైనా మానుకోవాలని ఆయన హితవు పలికారు. ఏడాదిన్నర కూటమి పాలనలో ప్రజలు విసిగి పోయారని... ప్రశ్నించే వారిని గొంతునొక్కే కార్యక్రమానికి తెరలేపడంపై ఆయన ధ్వజమెత్తారు. అనంతరం కోటి సంతకాల సేకరణ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకురాలు కోడూరు కల్పలత, రాష్ట్ర స్థాయి నేతలు బొలిగర్ల మస్తాన్‌యాదవ్, పాపకన్ను మధుసూదన్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, వివిధ విభాగాలకు చెందిన నేతలు చిట్టేటి హరికృష్ణ, ఆదిశేషయ్యానాయుడు, సదానందరెడ్డి, మల్లెల వెంకటేశ్వర్లు, గోపాల్‌యాదవ్, మండల అధ్యక్షులు మన్నారపు రవికుమార్ యాదవ్, పులి ప్రసాద్‌రెడ్డి, కార్తీక్‌రెడ్డి, కాల్తిరెడ్డి శ్రీనివాసులరెడ్డి, వెంకటకృష్ణారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, చింతల శ్రీనివాసులరెడ్డి, పద్మశాలీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ నక్కా వెంకటేశ్వరరావు, నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు కాటూరు రామతులసి వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ కోతలతో ఇక్కట్లు


పెళ్లకూరు ఉప విద్యుత్ కేంద్రం

పెళ్లకూరు: మండలంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ కోతలు భారీగా చేపట్టడంతో వినియోగదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. చిల్లకూరు, చెంబేడు క్రాస్‌రోడ్డు, శిరసనంబేడు, కప్పగుంటకండ్రిగ ప్రాంతాల్లో ఉన్న విద్యుత్ ఉప కేంద్రాల నుంచి వ్యవసాయ, గృహ విద్యుత్ సరఫరా ఉంటుంది. గత కొంత కాలంగా విద్యుత్ ఏఈ సెలవుపై వెళ్లడంతో నాయుడుపేట రూరల్ ఏఈ ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం చిల్లకూరు, జీలపాటూరు, పునబాక, చెంబేడు, కలవకూరు, పాలచ్చూరు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా సక్రమంగా ఉండడం లేదు. విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో విద్యుత్ అంతరాయంపై సరైన అవగాహన లేక ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయ సీజన్ కావడంతో మోటార్లుకు విద్యుత్ సరఫరా అందకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ అంతరాయంపై సమాచారం లేకపోవడంతో గృహ విద్యుత్ వినియోగదారులు రాత్రి సమయాల్లో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

గురుకులం తనిఖీ

నాయుడుపేటటౌన్: పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాలను శుక్రవారం సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ఆకస్మికంగా పరిశీలన చేశారు. గురుకులంలో విద్యార్థుల కోసం వండిన భోజనాన్ని తిని రుచి చూశారు. గురుకులంలో విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

కోటి సంతకాల సేకరణకు బ్రహ్మరథం


కాకాణి గోవర్ధన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి(సైదాపురం): వెంకటగిరి పట్టణంలో నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. నియోజకవర్గంలోని రాపూరు, కలువాయి, సైదాపురం, డక్కిలి, బాలాయపల్లి, వెంకటగిరి రూరల్, పట్టణ ప్రాంతాలనుంచి వందలాది మంది నేతలు, కార్యకర్తలు నేదురుమల్లి నివాసం వద్దకు చేరుకున్నారు. దీంతో నేదురుమల్లి నివాసం కార్యకర్తలు, నేతలతో కిక్కిరిసింది. కనీవినీ ఎరుగని రీతిలో ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించింది. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డికి ఘన స్వాగతం పలికారు.


పూజలు చేస్తున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి, నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

పోలేరమ్మతల్లి సేవలో కాకాణి, నేదురుమల్లి

వెంకటగిరి రూరల్: వెంకటగిరి శక్తిస్వరూపిణి శ్రీపోలేరమ్మతల్లి సేవలు ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆశీర్వదించి ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీఈసీ సభ్యులు బొలిగర్ల మస్తాన్ యాదవ్, చిట్టేటి హరికృష్ణ, నియోజకవర్గ పరిశీలకురాలు కల్పలత, పట్టణ కన్వీనర్ పులి ప్రసాద్‌రెడ్డి, వెంకటగిరి మండల అధ్యక్షులు కాల్తిరెడ్డి శ్రీనివాసులరెడ్డి, బాలాయపల్లి మండల కన్వీనర్ వెందోటి కార్తీక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలకు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..

చిట్టమూరు: మండల పరిధిలోని తంబుగారిపాళెం గ్రామంలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలకు విద్యుత్ శాఖ అధికారులు శుక్రవారం మరమ్మతులు చేసి నూతన విద్యుత్ తీగలు లాగారు. ఈ సమస్యపై 'సాక్షి' దినపత్రికలో శుక్రవారం ప్రచురితమైన యమపాశాలు అనే వార్తకు విద్యుత్ శాఖ ఏడీ చిన్నయ్య స్పందించారు. స్థానిక లైన్‌మన్ సునీల్‌కు కొత్త తీగలు అందజేసి మరమ్మతులు చేయాలని ఆదేశించారు. దీంతో లైన్‌మన్ యుద్ధ ప్రాతిపదికన ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలు తీసివేసి వాటి స్థానంలో కొత్త వైర్లు లాగి విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చేశారు.


మరమ్మతులు చేస్తున్న విద్యుత్ సిబ్బంది

స్తంభించిన ట్రాఫిక్.. అవస్థలు పడిన చోదకులు



ట్రాఫిక్ స్తంభించిపోయి వరగలి క్రాస్ రోడ్డు నుంచి నిలిచిన చిన్న పాటి వాహనాలు

చిల్లకూరు: జాతీయ రహదారిపై ట్రాఫిక్ స్తంభించిపోవడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జాతీయ రహదారిపై వరగలి క్రాస్ రోడ్డు వద్ద సాగరమాల రహదారి పనులు చేపడుతున్నారు. ఈ క్రమంలో రెండు వైపులా సర్వీస్ రోడ్డు నిర్మించడంతో వాహనాల రాకపోకలు సాగుతున్నాయి. ఈ క్రమంలో కురుస్తున్న చిన్న పాటి వర్షాలకు వరగలి క్రాస్ రోడ్డు వద్ద నిర్మించే ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద గుంత ఏర్పడింది. దీంతో భారీ వాహనాలు వచ్చే వెళ్లే మార్గం కావడంతో అక్కడ శుక్రవారం పనులు చేపట్టారు. ఈ పనులు పూర్తి కావడానికి సుమారు 7 గంటల సమయం పట్టడంతో ఇరువైపులా వాహనాలు నెమ్మదిగా పోవల్సి వచ్చింది. ఈ క్రమంలో అడ్డదిడ్డంగా ఆగిపోవడంతో వెనక వచ్చే వాహనాలు బారులు తీరిపోయాయి. సుమారు 2 కి.మీ. మేర వాహనాలు నిలిచిపోయాయి. ఈ విషయం గుర్తించిన పోలీసులు రంగంలోని దిగి వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించే ప్రయత్నం చేసినప్పటికీ సుమారు రెండు గంటల పాటు పట్టింది. దీంతో వాహన చోదకులు అవస్థలు అన్నీ ఇన్నీ కావు.

ఆలయ భూముల వేలం


హుండీ కానుకలను బయటకు తీస్తున్న ఆలయ సిబ్బంది

చిల్లకూరు: మండలంలోని తీర ప్రాంతం తమ్మినపట్నంలోని కోదండరామస్వామి ఆలయానికి అనుబంధంగా ఉండే ఆంజనేయస్వామి ఆలయానికి చెందిన మాగాణి భూములు శుక్రవారం ఆలయ ఆవరణలో వేలం పాటలు నిర్వహించారు. దేవదాయశాఖ అధికారులు సమక్షంలో నిర్వహించి ఈ వేలం పాటల్లో రూ.99,600 ఆదాయం వచ్చిందని అధికారులు తెలిపారు. ఆలయంలోని హుండీలో భక్తులు వేసిన కానుకలను లెక్కించగా రూ.27,070 వచ్చినట్లు తెలిపారు.

కండలేరులో 59.990టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 59.990 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 3790 క్యూసెక్కుల నీరు చేరుతుందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1,950, పిన్నేరుకాలువకు 500, లోలెవల్ కాలువకు 40, హైలెవల్ కాలువకు 200, మొదటి బ్రాంచ్ కాలువకు 5 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలో ప్రతిభ


హర్షిత

ఓజిలి : మండలంలోని కురుగొండ ఉన్నత పాఠశాలకు చెందిన హర్షిత రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలో సత్తాచాటి కాంస్య పతకాన్ని సాధించినట్లు హెచ్‌ఎం వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ఈనెల 13 నుంచి 16 వరకు రాజమండ్రిలో బాక్సింగ్ పోటీలలో కురుగొండ విద్యార్థి హర్షిత పాల్గొంది. ఈ పోటీలలో మూడవ స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని సాధించడంతో హర్షితను పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. వ్యాయామ ఉపాధ్యాయురాలిని హెచ్‌ఎం అభినందించారు. విద్యార్థిని హర్షితను హెచ్‌ఎం ప్రత్యేకంగా అభినందించారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ అమానుషం


నెల్లబల్లిరెట్టపల్లిలో సంతకాల సేకరణ చేస్తున్న గ్రామస్తులు

చిల్లకూరు: గత ప్రభుత్వం పేద విద్యార్థులకు నాణ్యమైన వైద్య విద్యను అందించేందుకు మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేస్తే, నేటి కూటమి ప్రభుత్వం వాటిని ప్రవేటు పరం చేసేందుకు పూనుకోవడం అమానుషమని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ అన్నారు. దీన్ని నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని శుక్రవారం మండలంలోని నెలబల్లిరెట్టపల్లి, ముత్యాలపాడు, తిప్పగుంటపాళెం, పారిచెర్లవారిపాళెం గ్రామాల్లో చేపట్టారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి ప్రజా వ్యతిరేక కార్యకలాపాలను చేపట్టి పేద వర్గంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాలకు తీరని అన్యాయం చేస్తోందన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ యద్దల మధుసూదన్‌రెడ్డి, ఎస్‌ఈసీ సభ్యులు వేమారెడ్డి కుమారస్వామిరెడ్డి, మేధావుల ఫోరం కన్వీనర్ నందవరం సుబ్బారావు, ఓడూరు బాలకృష్ణారెడ్డి, కట్టా రవీంద్రరెడ్డి, యల్లా శ్రీనివాసులరెడ్డి, దువ్వూరు దిలీప్‌రెడ్డి, షేక్ ఇస్మాయిల్, శ్రీధర్‌రెడ్డి, ఎల్లంటి సనత్‌కుమార్‌రెడ్డి, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో వైద్య సిబ్బంది నిరసన


చిల్లకూరు: నిరసన తెలుపుతున్న వైద్య సిబ్బంది

చిల్లకూరు: సమ్మె బాట పట్టిన వైద్యులకు సంఘీభావం తెలియజేస్తూ వైద్య సిబ్బంది ఆయా పీహెచ్‌సీల్లో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన శుక్రవారం కార్యక్రమాలు చేపట్టారు. చిల్లకూరు పీహెచ్‌సీలో పని చేసే సిబ్బంది ఆస్పత్రి ఎదుట నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ గత 13 రోజులుగా పీహెచ్‌సీల్లో పని చేసే వైద్యులు సమ్మె బాట పట్టి రిలే దీక్షలు చేస్తున్నా కనీసం ప్రభుత్వం పట్టించుకోక పోవడంతో ఆస్పత్రికి వచ్చే రోగులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు, స్టాఫ్ నర్సులు, ఫార్మసిస్టులు, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

డాక్టర్ల సమ్మెకు సిబ్బంది మద్దతు

కలువాయి(సైదాపురం): రాష్ట్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో విధులు నిర్వర్తిస్తున్న వైద్యులు, పీజీ సేవల కోట పెంపు, నోషనల్ ఇంక్రిమెంట్లు, టైం బాండ్ ప్రమోషన్ కోసం చేస్తున్నటువంటి పోరాట సమ్మెకు మద్దతుగా వారికి శుక్రవారం కలువాయి పీహెచ్‌సీ సిబ్బంది నల్ల బ్యాడ్జీలతో ధరించి మద్దతు తెలియజేశారు.

రేడియం స్టిక్కర్లతో సూచిక బోర్డు ఏర్పాటు



కోట: మండలంలోని చిట్టేడులో ప్రధాన రహదారిపై గ్రామస్తుల సహకారంతో శుక్రవారం రేడియం స్టిక్కర్లతో సూచిక బోర్డును ఏర్పాటు చేశారు. చిట్టేడు వద్ద గూడూరు- కోట ప్రధాన రోడ్డుపై తరచు గా ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు మార్గం విశాలంగా ఉండడం, రోడ్డు డివైడర్‌ను రాత్రిపూట గుర్తించలేక పోవడంతో పలుమార్లు వాహనాలు డివైడర్లను ఢీకొని ప్రమాదాలు జరుగుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు. గురువారం రాత్రి వాకాడు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు డివైడర్‌ను ఢీకొంది. దీంతో గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు. వారి నుంచి స్పందన లేకపోవడంతో గ్రామస్తులే స్వయంగా రేడియం స్టిక్కర్లతో సూచిక బోర్డును ఏర్పాటు చేశారు.

బైక్‌ను ఢీకొన్న ఆటో


సాయిని ఆస్పత్రికి తరలిస్తున్న డీఎస్పీ గీతా కుమారి

వెంకటగిరి రూరల్: బైక్‌ను గుర్తు తెలియని ఆటో ఢీకొనడంతో వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు పట్టణంలోని టీచర్స్ కాలనీకి చెందిన బి సాయి క్రాస్‌రోడ్డు వద్దకు బైక్‌పై బయల్దేరారు. అయితే గుర్తు తెలియని ఆటో సాయిని ఢీకొని వెళ్లిపోయింది. తీవ్ర గాయాలతో రక్తపు మడుగులో కొట్టుమిట్టాడుతున్న సాయిని అటువైపుగా వెళ్తున్న గూడూరు డీఎస్పీ గీతా కుమారి గుర్తించి హుటాహుటిన ఆటోలో ఎక్కించి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సాయికి వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం తిరుపతికి తరలించారు.

కూటమి నేతల ఆగడాలు.. ప్రజలకు అగచాట్లు




ఇళ్ల మధ్యలో నిల్వ ఉన్న మురుగునీరు, సిమెంట్ రోడ్డుపై మట్టి పోయడంతో నిల్వ ఉన్న మురుగునీరు జ్వరంతో బాధపడుతున్న చంద్రబాబు

బాలాయపల్లి(సైదాపురం): మండలంలోని యాచవరంలో ఓ టీడీపీ నాయకుడు తన ఇంటి ముందు ఉన్న సీసీ రోడ్డుపై గ్రావెల్ తోలడంతో వర్షపు నీరు నిలిచి దుర్గంధమైన వాసనతోపాటు వ్యాధులు గ్రామంలో చోటుచేసుకున్న సంఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. గ్రామస్తుల కథనం మేరకు, నెల రోజుల క్రితం యాచవరంలో టీడీపీ నాయకులు గొట్టు సత్యనారాయణ నాయుడు సీసీ రోడ్డుపై గ్రావెల్ తోలడంతో వర్షపు నీరు ప్రవహించకుండా నిలిచిపోయింది. దీంతో గ్రామస్తులు రోడ్డుపై మట్టి ఎందుకు తోలారని అడిగితే ''ప్రభుత్వం మాది మా ఇష్టం'' అంటూ దౌర్జన్యానికి దిగారు. పలు మార్లు అధికారుల దృష్టికి తీసుకపోయినా పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జ్వరాలతో అవస్థలు

సీసీ రోడ్డు పై మట్టి తోలడంతో వర్షపునీరు ఇళ్లలోకి రావడంతోపాటు అది మురికి దుర్గంధమైన వాసన పాటు పురుగులు ఇళ్లల్లోకి వస్తున్నాయి. దీంతో ఏ ఇంటికీ వెళ్లినా జ్వరాలతో బాధపడుతున్న రోగులే కనిపిస్తున్నారు. గ్రామంలో పారిశుద్ధ్యం లోపించి వారం రోజుల నుంచి అలమటిస్తున్న అధికారులు కనీసం బ్లీచింగ్ చల్లిన దాఖలాలు లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల దృష్టిలో ఈ ఊరు లేదేమో అని ఆరోపణలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే సీసీ రోడ్డుపై ఉన్న మట్టిని తొలగించాల్సి ఉందని తెలిపారు. ఈ విషయమై ఎంపీడీఓ నారాయణను వివరణ కోరగా సీసీ రోడ్డుపై తోలి ఉన్న మట్టిని త్వరలోనే తొలగిస్తామని తెలిపారు.

సీజేఐపై దాడికి యత్నం హేయం


సైదాపురం: తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

సైదాపురం: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయిపై దాడికి యత్నించడం హేయమని, నిందితులను వెంటనే కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు నకిరిపోయిన గంగాధర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. బస్టాండ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేశారు. అనంతరం అధికారులకు వినతి పత్రాలు సమర్పించారు.

చిల్లకూరు: మండల కేంద్రంలోని వరగలి క్రాస్ రోడ్డు వద్ద ఉన్న రెవెన్యూ కార్యాలయం ఎదుట శుక్రవారం ఎమ్మార్పీఎస్ నాయకులు నిరసన తెలిపారు. రెవెన్యూ అధికారులకు వినతి పత్రం అందించారు.

దొరవారిసత్రం : మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా, మండల నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి వినతి పత్రాన్ని రెవెన్యూ అధికారులకు అందజేశారు.

కలువాయి(సైదాపురం): మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ర్యాలీగా బయలుదేరి తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు.

రాపూరు: మండల కేంద్రంలో శుక్రవారం ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు.

గూడూరురూరల్ : సీజేఐపై దాడికి యత్నించిన వ్యక్తిని వెంటనే అరెస్టు చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఎస్‌ఛార్జి దేవదాస్ మాదిగ డిమాండ్ చేశారు. గూడూరు, బాలాయపల్లి తహసీల్దార్ కార్యాలయాల వద్ద శుక్రవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు.

ఓజిలి: మండల రెవెన్యూ కార్యాలయం ఆవరణలో మ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు జీ శివరవి ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపి డీటీ మధుసూదన్‌రాజుకు వినతిపత్రం అందించారు.